# 22

# పోషవ్వ

## సంజె నీడలు

**బా**రెడు పొద్దెక్కింది.

చల్లగా ఈదురుగాలి.

ముదురు కలుపుల రోజులు.

ఆ రోజు శనివారం. అది బట్వాడా రోజుకూడా.

ఆలస్యంగా వచ్చేవాల్లను నిన్నటిలాగా సగం కూలికైనా తీసుకోనన్నాడు రాంరెడ్డి దొర. ఊరోళ్ళందరి దగ్గరికన్నా ఒక రూపాయి ఎక్కువ వసూలు చేస్తున్నప్పుడు నేనెందుకు ఊర్కోవాలి? పావుగంట లేటయినా తీసుకోనంటున్నాడు. వచ్చేవాల్లు తొందరగా బయల్దేరండి. అని రాంరెడ్డి దొరకు పాలేరుగా పనిచేస్తున్న పోషవ్వ మరిది రాజయ్య ఆ వీధిలో అందరికీ వినపడేలా చెప్తున్నాడు.

కాని పోషవ్వకు నిన్న జరిగింది చూశాక ఆ మాట పక్కలో బాంబు పడ్డట్టుగా వుంది. చంటిదాన్ని చంకన వేసుకొని వెనక వరుసలో వెళ్తున్నవాళ్లతో బయల్దేరినా పొలంకాడికి రెండు మైళ్ళు నడిచేసరికి బాగా వెనకబడిపోయింది. నిన్న అరగంట లేటయినందుకు పదిమందితోపాటు ఆమెనికూడా ససేమిరా వద్దన్నాడు. ఒక రూపాయి కూలీ ఎక్కువ వస్తుందనే ఆశ ఆడియాసయింది. ధనిక రైతుల దగ్గరైతే అర్ధరూపాయి ఎక్కువ వస్తుంది. మిగిలిన వాళ్ళ దగ్గర ఎనిమిది రూపాయలేనాయె. అందుకని దొర పొలంలో పనికోసం వూళ్ళో అందరికీ మనస్సులోనే ఒక రకమైన మానసిక పోటీ. అది చివరకు నిన్న అలా ముగిసింది. అందరూ కాళ్ళావేళ్ళా పడితే సగం కూలికి చేస్తామని ఒప్పుకుంటే మధ్యాహ్నం నుంచి పొలంలోకి దిగనిచ్చాడు దొర. ఈ పూట పైపెచ్చు బట్వాడా రోజున. వెంటనే డబ్బులు చేతిలోకొచ్చే రోజు చూసి అదీ లేదంటున్నాడు దొర. అంతదూరం వెళ్ళి ఉట్టి చేతుల్తో తిరిగిరావడం ఎలా? ఇంకెవరైనా పనిలోకి తీసుకుంటారా అంటే అదీ లేదు. వాళ్ళంతా రేపటికోసం ఈ రోజే ఖాయం చేసుకుంటారాయె. రెడ్డి కాపుల

రత్నవ్వ వచ్చి అడిగింది గానీ తానే ఊఁ అనలేదు ఆఁ అనలేదు. దొర పొలంలో అయితే యారాలు (తోడికోడలు) ఎల్లవ్వ ఒక పక్క తాను ఒక పక్క మధ్యలో తన పదేళ్ళ కొడుకు సమ్మయ్య – ఇలా మునుంలో సమ్మయ్య వెనకబడిపోకుండా చెరో చెయ్యి వేసి కలుపు తీసుకుంటూ కలుపుకు పోవటానికి వీలవుతుంది. సమ్మయ్యకు పెద్దోల్ల కూలిగిట్టుతుంది. రత్నవ్వ వానికి సగం కూలీయే యిస్తానంది. యారాలు ఎల్లవ్వ మొగుడు; దొర దగ్గర పాలేరుండగా వేరే వాళ్ళ పొలంలోకి కూలీకి వస్తే ఎలా వుంటుంది?

అందుకే మరిది మాట చెవినపడ్డ పోషవ్వ మొదటి సైరన్ విన్న దాని లాగా గాబరాపడుతోంది. నిన్న ఉత్తప్పుడే ఆలస్యమైంది. పైపెచ్చు ఈ పూట వంటపని మధ్య ఓరకుంది (ముట్టయింది). నడిచే కాళ్ళల్లో కట్టె యిరికించి నట్టయింది. ఉస్సురంది, పదేళ్ళ కొడుకు సమ్మయ్య బోరింగ్ కాణ్ణించి నీళ్ళు మోసుకొస్తున్నాడు.

పోషవ్వ ఏడాది కూతురికి యిన్ని వేన్నీళ్ళు పోసాననిపించి చాపలో పడుకోబెట్టింది. గుడిసె పక్కనే దడికట్టిన స్నానశాలలో తాను బడబడా యిన్ని చన్నీళ్ళే పోసుకుంది. ముట్టయిన చీరను తడిపి పనికి పోయి వచ్చాక రాత్రి వుతుక్కోవాలి అని – కుక్క ఎత్తుకుపోకుండా దానిపై బండరాయి ఉంచింది.

గబగబా సమ్మయ్యకు యింత మొక్కజొన్న గడుక వేసింది. తాను యింత వేసుకుంది. ఇంత గిన్నెలో కట్టుకుంది.

తలుపూ తాళం వేసింది. తలుపూ తాళం అంటే మరేంలేదు. సైకిళ్ళు, యింజన్ల గ(ట్రాల ప్యాకింగ్‌కు వచ్చే బూరుగు డబ్బా చెక్కల్తో చేసిన చిన్న ఒంటిరెక్క తలుపు. దానికి కేబుల్ వైరుతో అల్లిన తాడు. ఆ తాడు కొక్కేనికి తగిలించి కొంచెం వడిదిప్పితే అదే తాళం అన్నమాట.

ఎంత తొందరపడ్డా మరిదితో సహా మగపాలేర్లంతా అప్పటికే వెళ్ళి పోయారు. మగకూలీలు, ఆడకూలీలు గబగబా తోవ సాగుతున్నారు. ఎనిమిది నెలల కడుపుతో వున్న పోషవ్వ యారాలు కూడా అయిదేళ్ళ కూతురుని తీసుకొని ముందే వెళ్ళిపోయింది.

సమ్మయ్యా పోషవ్వా, తల్లీ కొడుకు యిద్దరు ఈ గూడెం దాటి చెరువుకట్ట ఎక్కారు. చంకన చంటిదాంతో పాటు తల్లి గబగబా నడుస్తుంటే సమ్మయ్య

పరిగెత్తి అందుకోవల్సి వస్తోంది. వెనకబడిపోతూనే నీయవ్వ! జెల్ది (తొందరగా) నడువు అని తల్లిని హెచ్చరిస్తున్నాడు సమ్మయ్య.

చెరువు కట్ట సగం సాగేసరికి యారాలును అందుకుంది పోషవ్వ. యారాలు కూతురు సి(ర గోనె (క(రాబిళ్ళా)లో 'పత్తయికెనాం' పాట లాగా ముందుకు పరిగెత్తి తల్లికోసం వెనక్కి తిరిగి చూస్తోంది. తల్లి ఎల్లవ్వ తన పొట్ట బరువూ పెనిమిటికీ తనకూ మోసుకొస్తున్న సద్దిగిన్నె బరువుతో ఆయాసంగా నడుస్తోంది.

మరో నాలుగు అంగల్లో యారాలును అందుకుంది పోషవ్వ. ఎగపోస్తున్న ఎల్లవ్వకేసి అలవాటుగా చూసి తన కూతుర్ని చంకకు అందించి నడక సాగించింది. కొంతసేపు అలుపు తీరాక మళ్ళీ తీసుకుంది. అవ్వా కాల్లు నొత్తున్నయే అని యారాలు కూతురు కూలబడిపోవడంతో తన కూతుర్ని మళ్ళీ యారాలుకిచ్చి యారాలు కూతుర్ని తాను ఎత్తుకుంది. సద్దిగిన్నె సమ్మయ్యకి నిమిష నిమిషానికి బరువు పెరిగి బండను మోస్తున్నట్టుగా వుంది.

అప్పటికే చాలామంది పొలాల్లో పనిలోకి దిగిపోయారు. ఈ పూట పని హుళక్కేమోననే భయంతోనూ, పరుగుతోనూ పోషవ్వ గుండె దడదడలాడుతోంది. వెంట యారాలు ఉన్నందుకు కొంత ధైర్యంగా ఉంది. కాని తనతో పాటు యారాల్ని కూడా - తన పాలేరు భార్యే అని చూడకుండా నిన్నటిలాగే పొలంలోకి దిగవద్దంటాడేమోనని అనుమానంగానూ వుంది.

పొలాలన్ని పచ్చగా నిగనిగలాడుతున్నాయి. చెరువులో సగానికి పైగా వున్నాయి నీళ్ళు. మళ్ళీ ఓసారి వర్షం పడ్తే చాలు. మళ్ళీ నిండిపోతుంది చెరువు.

చెరువు కట్ట దిగి చెలుకల్లో పడ్డారు. బండ్లబాట (పానాది) వెంట నడుస్తున్నారు. రెండువైపులా కంది, మొక్కజొన్న, జొన్న ఏపుగా పెరుగుతున్నాయి. బాటకు రెండువైపులాగల 'దడి'కి చిక్కుళ్ళు, సొరకాయ, బీరలు కట్ల పొదలు తెగపారి ముళ్ళకంపే కన్పించడం లేదు. చేను చెలకలమీంచి కమ్మని పైరగాలి సన్నగా వీస్తోంది. ఎంతో మధురంగా వుంది ఆ గాలి.

అయినా సమ్మయ్యకు అదేమీ పట్టినట్టులేదు. చెమటలు కక్కుతున్నాడు. సద్దిగిన్నె అవ్వకిచ్చేశాడు. ముగ్గురి పని అలాగే వుంది. చంకలో పిల్లల బరువు, చేతిలో సద్దుల బరువు మోసి మోసి, పరిగెత్తి పరిగెత్తి చెమటలు కక్కుతున్నారు. ఆయాసపడిపోతున్నారు.

చేన్లమీద చిన్న చిన్న పిట్టలు ఎగురుతున్నాయి. కిచకిచమంటున్నాయి. రంగురంగుల పిట్టలు, పసందైన పక్షుల కోలాహలాన్ని పసితనపు సంతోషంతో అటుకేసి చూస్తున్నాడు పదేళ్ళ సమ్మయ్య. ఆరేయి జల్ది నడు. అటుయిటు చూడకు అని ముందు నడుస్తున్న పోషవ్వ తేపకోసారి వెనక్కి తిరిగి హెచ్చరిస్తూనే వుంది

ఆ చెలకలన్ని దాటేసి బోల్లకంచెలోకొచ్చారు. చిన్న గుట్టపక్కగా నడుస్తున్నారు. గుట్టకు యిటువైపు బావుల కింద పొలాలున్నాయి. కరెంటు మోటార్లు యింకా నీళ్ళు పోస్తూనే వున్నాయి. పనుల్లోకి దిగిన వాళ్ళు పిల్లలు పంపునీళ్ళ జలపాతంలో బరివాత (నగ్నంగా) ఆడామగా పసిపిల్లలు కలిసి జలకాలాడుకుంటున్నారు.

దొరగారి బావిగడ్డకున్న మామిడిచెట్టుకు టిఫిన్ క్యారియర్‌లు (సద్దిగిన్నెలు) వేలాడుతున్నాయి. తమ సద్దుల్ని కూడా వాటి పక్కన కట్టేశారు వాళ్ళిద్దరు.

యారాలు కూతుర్తో చెల్లెల్ని ఆడిపించుకోయే అని ఆ మామిడిచెట్టు కింద పాతచీరె పరిచి తన కూతుర్ని కూర్చోబెట్టింది పోషవ్వ. పంపుకాడ స్నానం చేస్తున్న పిల్లల్ని యిటుకేసి చూడురా అని చెప్పి పొలంకేసి నడిచారు.

రాజయ్య పొలం అంతా తిరిగొచ్చి మోటారు ఆపమని కేకేసాడు. మోటారు ఆగిపోయింది. ఆ రోజు శనివారం కావడంతో తిరుపతి వెంకన్నకు చేసే పూజా పునస్కారాలు ముగించుకోవడం రాంరెడ్డి దొరకు లేటయినట్టుంది. యింకా అక్కడికి రానట్టున్నాడు. అయినా సైకిల్ మోటార్‌పై రావడం ఎంతసేపు - ఏ క్షణానైనా రావచ్చు. తాను ఏదో కొంత కన్సెషన్ యిస్తున్నట్టుగా రాజయ్య ఏదో అంటున్నాడు.

"ఇగో ఆలస్యంగ వచ్చి పొలంల దిగినట్టుకాదు. ఇగో ఈ పట్టె మొత్తం ముదురు కలుపు దియ్యాలె. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. దొర వచ్చేటాళ్ళకు నిన్న ఈ యాళ్ళకు మునుం ఎంత ముందుకు సాగిందో అంతముందటికి సాగాలె. ముచ్చట్లు వెట్టినట్టు కాదు. దొరవచ్చినంక యిక దొర యిష్టం మీ యిష్టం."

"హమ్మయ్య!" అని ఒక గండం గడిచినట్టుగా నిశ్వాస విడిచింది పోషవ్వ. గబగబా పొలంలోకి దిగింది. పోషవ్వ ఎల్లవ్వల మధ్య సమ్మయ్య మునుం పట్టాడు. ఎల్లవ్వ "నాట్లేసి నాట్లేసి లచ్చుమమ్మో..." పాట అందుకుంది. అందరూ కోరస్ యిచ్చారు. ఎనిమిది నెలలు నిండిన కడుపుతో ఎల్లవ్వకు అలా పాడుతుంటే కొంచెం అలుపు తగ్గినట్టుగా వుంటుంది. ఇలాంటప్పుడు దొర వినికూడా

విననట్టుగా, చూసికూడా చూడనట్టుగా గంభీరంగా వుంటాడు. కాని రాజయ్య పరుగుపరుగున పరిగెత్తుకొచ్చాడు.

"పాటలు తర్వాత పాడుకుందురుగాని దొర వచ్చేటాళ్ళకు ముందుగాల మునుం పట్టినోల్లను జెల్ది అందుకొ(్రని అని భార్యని గద్దరాయించాడు. అందులో ఆప్యాయత కూడా వున్నట్టు మగనికేసి చూసి కళ్ళతోనే నవ్వింది ఎల్లవ్వ.

చేతిలో కంకకర్రతో కిర్రు చెప్పులతో పంచె పిక్కలదాకా ఎగకట్టి ఎండకు నల్లగా మెరిసిపోతున్నాడు రాజయ్య.

"ఇయ్యాల్ల ఏంకూర జేసికచ్చినవే" రాజయ్య ఆబగా చూస్తూ అడిగాడు.

"ఈ ఎగిర్తాని (వేగిరాని)కి ఏంకూర జేత్తరు? రాత్రిది యింత సాపల పులుసుంటే ఏసుకచ్చిన. నాకు చింతపండు తొక్కు తెచ్చుకున్న."

చిలకా గోరింకల్లా యారాలు. మరిదీ మాట్లాడుకున్న ఆ రెండు ముచ్చట్లకే పోషవ్వ మౌనం దాల్చింది. వాళ్ళకేసి చూడకుండా కొడుకుదీ తనదీ మమునుం గబగబా కలుపు తీస్తోంది. ఇలా ఆమెకు తన భర్త గుర్తొచ్చినప్పుడల్లా ఏం చేయాలో తోచదు. చేతిలో వున్న పనే గబగబా చేస్తూ పోతుంది. ఆ పనిలోబడితే ఆ విషయాలు మరిచిపోవచ్చునని ఆమె ఆరాటం ఎలాగైతేనేం దొర వచ్చేసరికి ఎవరు ముందొచ్చారో ఎవరు వెనకొచ్చారో తెలియకుండా అందరూ ఆకాశంలో ఎగురుతే వరుసగా పోయే కొంగల్లా పొలంలో బారులు తీరి వున్నారు.

ఒకటి రెండుసార్లు పొలంచుట్టూ తిరిగి మామిడిచెట్టు కిందకెళ్ళి పోయాడు రాంరెడ్డి దొర. పిల్లలకు దొర వచ్చాడని భయమేమీలేనట్టుంది. పంపుకాడ పశువులకూ, కాళ్ళు కడుక్కోడానికి కట్టిన చిన్న కుండి (రిజర్వాయర్) నీళ్ళల్లో పిల్లలు బరివాత పడీపడీ ఎగురుతూనే వున్నారు. వాళ్ళకేసి చూసి ఓసారి దగ్గాడు. ఉహుఁ! పోరగాళ్ళలోకం పోరగాళ్ళదే. వాళ్ళకు దొరను గౌరవించాలనేం పట్టింది. ఇక దొరే తన చూపు యిటు తిప్పుకుని తనకోసం వేసిన చాపలో హాయిగా ఒరిగాడు.

పదేళ్ళకి యిప్పటికి ఎంత మారిపోయిందో... యిప్పుడు గుడ్డబట్టలేని పోరగాళ్ళు తన మోకాలుకాడికి లేని పోరగాల్లు, ముక్కుసీమిడి పోరగాల్లు కూడా తనను దేక (పట్టించుకో)కుండా అయిపోయింది... నీసంగం మహిమ పెళ్ళాం.

దెం... ఇంకెన్ని రోజులుంటుందో చూడనా...! నీత్తల్లి... మామిడిచెట్టు కింద సైతం విశ్రాంతి లేకుండా పోయింది. ఇక్కడ తాను మాదిగి పోరగాన్ల పక్కన పడుకోవల్సి వస్తోంది. ఇంతకుముందు ఆ తుమ్మచెట్టుకింద పిల్లగాండ్లను పండేసుకోవడానికి సైతం ఎంతో భయభక్తులతో అడిగేవాళ్ళు. నీ తల్లి! ఈ చెట్టుకు ఈ సద్దులొకటి. ఇలా వెల్లికలా పడుకుంటే గాలికి ఏది ఎప్పుడు తెగి మీదపడుతుందో తెలియదు. ఎవడైనా మీదపడాలనే అట్లా లూజ్‌గా కట్టినా కడ్తాడు. కోపంలేని దెబ్బ. ఎవడిని అనడం? అందుకే ఈ చెట్టు కింద రోజుకో చోటు మారుస్తున్నాడు. ప్చ్. ఇలా తన చెట్టు తనకు పరాయిదైపోయింది.

వీల్లు చక్కగా ఆడుకోనైనా ఆడుకోరుగదా! అయినా ఈ పోరగాన్లు ఎపుడూ ఏడుపే. ఒకర్నొకరు తన్నుకుంటారు. కొట్టుకుంటారు అరుపులు కేకలు. చల్లగా ఈ చెట్టు నీడకు ప్రశాంతంగా ఓ కునుకు తీద్దామంటే వీల్లేకుండా అయిపోయే.

ఆ రోజులు ఎక్కడపోయే? యాడాదైనా నిండని పిల్లలది యిదొక గోలైపోయింది. ఓ ఉత్త పాలపీకనైనా కొని నోట్లో పెట్టిపోతే వాళ్ళే చప్పరించు కుంటారు. ఈ గోలైనా తగ్గుతుంది కాసేపు.

'ఎవర్రా అక్కడ... ఏం చేస్తున్నార్రా? ఇటురార్రా?' అని పిలిచాడు రాంరెడ్డి. ఓ యిద్దరు పిల్లలు గబగబా నగ్నంగా పరిగెత్తుకొచ్చారు. ప్చ్. పిలిస్తే కూడా ఎవడూ కదలడే... అంతమందిలోంచి యిద్దరా వచ్చేది... అనుకొని వాళ్ళని పిలిచిన పని చెప్పాడు. "నీతల్లి పోరగాన్లకు పాలిమ్మని కూడా తానే పిలిపించాల్సి వస్తోంది."

వాళ్ళు గబగబ్బా పొలాల ఒడ్లవెంట అలాగే నగ్నంగా పరుగు దీశారు... ఒకడు పొలంలో దిగబడిపోయాడు. మరొకడు పరిగెత్తి చెప్పాడు. పోషవ్వ గబగబా పరిగెత్తుకొచ్చి పాలిచ్చి జోకొట్టి నిద్రబుచ్చి మళ్ళీ పొలంకేసి వెళ్ళింది. ఎందుకో ఓసారి టైంకేసి చూసుకున్నాడు రాంరెడ్డి.

ఎండ తీవ్రంగా వుంది. 'పిల్లతల్లి' యాల్లయింది. పంపు మళ్ళీ స్టార్ట్ చేసి అందరూ కాళ్ళు చేతులు కడుక్కొని సద్దులకోసం వస్తున్నారు. ఇక్కడే వుంటే... ఎదురుగానే ముచ్చట్ల పెట్టుకుంట తింటారు... అన్నీ ఆడవాళ్ళ ముచ్చట్లు... ఏంకూర జేసుకున్నవవ్వా... నీళ్ళు (కడుపు రావడం) పోసుకున్నట్టు చింతపండు తొక్కు గట్ల నాకుతున్నవేందో అనే కారెడ్డాలు (పరాచికాలు).... ఛీ... ఛీ...

ఇక్కడే ఉండి.. ఉన్న ఆ కాస్త పరువుదీసుకోవడం ఎందుకులే.... అని లేచి అలా పొలంచుట్టూ తిరిగి రావడానికన్నట్టుగా గొడుగు తీసుకుని బయల్దేరాడు రాంరెడ్డి.

పోషవ్వ మొక్కజొన్న గడకలో యిన్ని నీళ్ళుపోసి 'ఉప్పురవ్వ'ని మెత్తగా కలిపింది. ఒకటే గిన్నెలో తల్లీకొడుకులు తింటున్నారు. సద్ది గిన్నె మూతకు అంటుకుపోయిన చింతకాయ తొక్కును చేత్తో తీసుకొని నాకుతూ చప్పరిస్తూ ఆ నీళ్ళగడక కమ్మగా ఆకలిగా లొట్టలు వేస్తూ తింటున్నాడు సమ్మయ్య.

యారాలు కొడుక్కేసి చూసి ఎల్లవ్వ మనస్సు తరుక్కుపోతోంది. వాడి ఒళ్ళంతా రోజురోజుకూ నల్లబడిపోతోంది. తన చిన్న తమ్ముడుతోటి వాడేవీడు. వాడికి ఈ ఏడు హాస్టల్లో సీటు దొరికింది. మూడో తరగతి చదువుతున్నాడు. వీడేమో యిక్కడ... యిలా....! పని చేయలేకపోతే సంసారం గడవదు. ఉస్సురంది ప్రాణం. కొంచెం చేపల పులుసు కలిపిన అన్నం తీసి వాడికి రెండు ముద్దలు చేసి చేతిలో పెట్టింది ఎల్లవ్వ.

"నాకు లడ్డు నాకు లడ్డు" అని చెంగచెంగ కాళ్ళు ఎగరేసింది స్వంత కూతురు. "పోరి! బాగ కారమున్నది. తినవు నువ్వు. ఊంచి పారేస్తవ్. "వద్దు" అని వారిస్తోంది ఎల్లవ్వ.

అక్కడవాళ్ళంతా సద్దుల బతుకమ్మ పండుగకి యిటుగా వచ్చి తింటున్నట్టుగా కోలాహలంగా వుంది.

అలా అరగంట అచ్చట్లు ముచ్చట్లు. అలుపు తీర్చుకొని అన్నంతిని మళ్ళీ పొలంకేసి నడిచారు.

పొలంలోంచి రాంరెడ్డి మళ్ళీ చెట్టుకిందికి చేరాడు. పనివాళ్ళు – పొలాల్లో వంగి కలుపులు తీస్తున్నారు. ఆ ఒడ్లవెంట తిరుగుతూ వుంటే దానికి లైటింగ్ కొట్టినవ్. దీనికి లైటింగ్ కొట్టినవ్ అని మునుపు టైం దొరికిచ్చుకొని తన్నింద్రు. ఎందుకొచ్చిన పీకులాట... అని మళ్ళీ చెట్టు కింద కూర్చున్నాడు రాంరెడ్డి.

వాళ్ళకు యిదేమీ పట్టనట్టుగా ఏవేవో పాడుకుంటూ ఎండలో నడుం వంచి తమ పని తాము చేసుకుపోతున్నారు. ఈ పూట వచ్చే బట్వాడా డబ్బుల్ని ఖర్చు చేయటానికి మనస్సులోనే బడ్జెట్ అంచనాల్ని తయారు చేసుకుంటోంది పోషవ్వ.

❄ ❄ ❄

పోషవ్వ ఇంటికి చేరేసరికి చీకటి పడిపోయింది. సమ్మయ్య బట్వాడా అడుక్కురావటానికి దొర యింటికి వెళ్ళాడు. బట్వాడా కోసం పోషవ్వ ఆ మధ్య అది జరిగిన్నుంచి అటుకేసి వెళ్ళడం లేదు. ఒకటిరెండుసార్లు వెళ్లింది కానీ పాత విషయాలు గుర్తొచ్చి ఆ రాత్రంతా నిద్ర కరువైంది. అప్పట్నించి కొడుకునే పంపిస్తోంది. ఎలాగూ అక్కడ మాట్లాడ్డానికి మరిది వుండనేవుండె అని పోషవ్వకు కొంత భరోసా.

పోషవ్వ బోరింగ్ కాణ్ణించి నీళ్ళు మోసుకొచ్చి పొద్దున నానబెట్టిన ముట్టుచీర వుతికి ఆరేసింది. కొడుకు రాకకోసం ఎదిరిచూస్తోంది. బట్వాడా వచ్చాక ఈపూట ఉల్లిపాయ కోడిగుడ్డు మసాలా కూర జేద్దామనుకుంటోంది. అప్పటికే బాగా అలిసిపోయింది. కాని పనిచేయక తప్పదు. కోడిగుడ్డు కూరలోకి గడక బాగుండదని వున్న ఆ కాస్తా దొడ్డు బియ్యం చాట్లో పోసి చెరిగి యిసుక చేస్తోంది. ఏడాది కూతురు వాకిట్లో ఆంబాడుతూ, నిలబడుతూ నడకలు నేరుస్తూ అడ్డంపడి లేస్తూ ఆడుకుంటోంది.

సమ్మయ్య ఏడుస్తూ వచ్చాడు. చాట పక్కన పెట్టి దగ్గరకు తీసుకుంది.

"ఏమైందిరా?"

"దొర తిట్టిండు..."

"ఎందుకురా? ఏమమన్న ఎదురు మాట్లాడినవా ఏందిరా? మీ చిన్నాయన అక్కడ లేడా?"

"ఉన్నడు..." సమ్మయ్య ఏడుపుతో కెక్కుతున్నాడు. చెప్పడానికి వెక్కిళ్లు తెరిపియ్యడం లేదు. అంతలో యారాలు సాపిచ్చు (శపించు)కుంటూ వచ్చి విషయం చెప్పింది.

"నువ్వేమో పిల్లతల్లివట. వీడేమో చిన్నపోరడట... నువ్వు దీనికి పాలిచ్చుటానికి నాలుగయిదుసార్లు అటుయిటు పిర్రలు తిప్పేసరికే పొద్దుగూకె. ఇక నువ్వేం పని చేసినవని... నిండు కూలియ్యటానికి? మీ యిద్దరికి కల్సి ఒకటే కూలి యిస్తనన్నడు."

పోషవ్వకు రోషం. దుఃఖం ఒక్కసారిగా పొంగుకొచ్చాయి. ఈ వారం రోజులు ఒక్క మబ్బుతునకైనా లేని ఎర్రటి ఎండలో నడుమంతా చర్రుమని మండుతుంటే పాలుసేపు లచ్చినా రొమ్ములు సలుపుతున్నా అట్లనే పొలంలో వుండుకుంటూ

పని చేసింది. ఏపుగా పెరిగిన హైబ్రిడ్ వరి మొక్కల్లో వరి పాయెల్ని అటుయిటూ పాపుకుంంటూ కదిలిస్తూ కలుపులు పీకుతుంటే నడుములు కలుక్కుమనేవి. వరి కర్రలు ఒరుసకపోయి, బ్లేడు గీసుకపోయినట్టు భుజాలదాకా చేతులు, మోకాళ్ళు దాకా కాళ్ళు, ఇప్పటికీ మండుతూనే వున్నాయి. వంగి కలుపులు తీస్తుంటే మెడమీది చెమట కండ్లలోకి కారి కండ్లు మండుతుంటే ఆ చేతుల్తోనే తుడుచుకొనేసరికి ఆ వరి ముండ్లు కండ్లలో కుచ్చుకుపోయి కండ్లు మరింత మండుతున్నాయి. ఆ పొద్దు బుధవారం నాడు ఆకుతేలు చీరమీంచి పాకి వీపున చటుక్కున కుట్టి ఎంత తల్లడిల్లిందో, అయినా పోరడు వెనక పడ్డాడేమో ఎట్లా అని బాధను పంటితో బిగపట్టి కలుపులు దీసింది.

“మరి నువ్వా... రాజయ్య గిదేం అన్యాయమని అడగద్దా....”

“మా (అది కూడా) అడిగిన, అడుగుతే ఏమంటడు? నేను పొద్దులు నిండినదాన్నట నువ్వు పసిపిల్ల తల్లివట... ఇకమనం యిద్దరం కల్సి వాని మునుంను కూడా కలుపుకుంటూ కలుపు దీసింద్రని ఎట్లా అనుకోవాలె అని శాత్రాలు దీసిండు... వరికోతలప్పుడైతే అట్లా చేసిరంటే వొప్పుకోవచ్చు. అది కండ్ల ఎదురంగ కనపడ్తది. ఇవి ముదురు కలుపులు. ఇండ్ల ఎవలు ఎంత కలిసిర్రో కలువలేదో ఎట్లు తెలుస్తది? కలుపు మొక్కలుంటే నీ రూపాయి ఏమోగాని నాకు ఎంత నష్టం? అని అనబట్టె. ఆఖరికి మీ మరిది బతిమలాడంగ బతిమిలాడంగ ఈ వారం రోజులకు మీ యిద్దరికి కలిసి ఓ పది తక్కువ చేసి రెండు నిండు కూలీలు మా యిచ్చిండు.

పోతే పోయాయి పది రూపాయలు. వాని బొందమీద పెట్టినా అనుకుంటా... మొత్తం కూలి ఎగబెట్టలేదు నయం అని ఊరటపడింది పోషవ్వ.

“మరి ఎందుకు తిట్టిండే వీన్ని?”

“ఏ... తిట్టలేదక్కా... మీ మరిది ఎదురంగవుండగనే తిడ్తడా అక్కా? గంత ధైర్నమా? ఈడు ఎందుకియ్యవ్ అని మీదిమీదికి పోయినట్టు గుడ్లు తెరిసి చూసిండు. ఆజనా మోకాలుకాడికి లేని పోరడు గూడ బెదిరిచ్చుడేనా అని అనుకున్నడో ఏమో... దొరకూడా గుడ్లు తెరిసి ఇట్ల (ఇట్లా) చూసిండు... ఆ గుడ్లు ముందే కోడిగుడ్లంత గాలిపోయె. ఎర్రగా మండుతున్నట్టుండె. యిగ వీడు భయపడ్డడు... గంతే.” నవ్వుతూ వాడికేసి చూసింది ఎల్లవ్వ...

"ఊ!... నీయవ... తిట్టలేదా... 'మీ అయ్యనే అంటే నువ్వు మీ అయ్య జుట్లకెల్లి ఎల్లినట్టున్నవెంరా? అని అనలేదా?"

పోషవ్వకు ఆ మాట వింటుంటే పైకి కోపం వచ్చినా లోలోపల సంతోషంగా వుంది. అయినా దొర కూలీ యిచ్చేవాడేగానీ అవీయివీ ఎంచడం ఏంటి?

"మరి గట్లందుకెనాల్నే ఎల్లవ్వా"

"ఏం అట్లగాదే అక్కా. బట్వాడా యిచ్చుకుంట నవ్వుకుంట అన్నడే ఆ మాట..."

"ఔ.. రా?" అడిగింది పోషవ్వ.

సమ్మయ్య తన తల్లి కళ్ళల్లో నవ్వు సంతోషంలాంటి మెరుపుచూసి – అయితే యిది తిట్టు కాదన్నమాట అని ఖరారు చేసుకున్నాడు. వాడు కూడా కండ్లు తుడుచుకొని నవ్వుతు ఔ... అని యికిలించాడు.

"అయినా అరెయి తోరెయి ఎందుకనాలెనె"

"పదేండ్ల పోరన్ని గట్లెందుకన్నవ్ అని... నువ్వేపోయి అడుగరాదే అక్కా" అని నవ్వింది ఎల్లవ్వ... యారాలు దొర యింటికి ఎలాగూ వెళ్ళదు.

రాత్రి పడుకుందన్నమాటే గానీ దొర నోట చాన్నాళ్ల తర్వాత తన భర్తని పరోక్షంగానైనా పొగడ్డం ఎన్నో జ్ఞాపకాల్ని రేపింది. సంతోషంతో పాటు దుఃఖాన్నీ కలిగించింది. తానూ, భర్త దొర పొలాల్లో చెట్టాపట్టాలేసుకొని ఎలా తిరిగారో... ఆలుమగలు పాలేర్లుగా ఎంతెంత పనులు చేసి పెట్టారో... రాత్రనకా పగలనకా. ఇది యింటిపని. అది పొలం పని అని వంకలు పెట్టకుండా చెప్పిన పనల్లా పల్లెత్తుమాట అనకుండా, పడకుండా చేశారు... అలాంటిది ఓ రోజు... తాను నీళ్ళు పోసుకున్నాననని... ప్చ్... ఆ కడుపు నిలువనైనా నిలువలేదు. నాలుగు నెలలకే చీరె విడిసేసింది. అప్పుడు పది రోజులు మూలకు పన్నది... కడుపు నిలువలేదు గాని ఆయన మీద ఎన్ని దెబ్బలు అట్టుదేలి నిలిచిపోయాయో... తాను నీళ్ళు పోసుకున్నానని ఓ పది హైబ్రిడ్ మొక్కజొన్న కంకులు విరుచు కొచ్చాడు. ఒలిచి రుబ్బి పచ్చి మొక్కజొన్న అట్లు పొయ్యమన్నాడు...

నిజంగా తనకు మనసులో కూడా అదే కోరిక వుండింది. దొరకు ఎట్లా తెల్సిందే ఏమో... అబ్బ ఎన్ని దెబ్బలు కొట్టాడు? ఆ పది కంకులకే పెరడంతా లూటీపోయిందన్నాడు. ఇంటికి పిలిపించుకొని నీలగిరి చెట్టుకు కట్టేసి ఎంత

కొట్టాడో... ఆ తర్వాత వూళ్ళోకి సంగం వచ్చాక అంతకు అంత తీసుకున్నారు. కాని ఆ సంతోషం కూడా ఎంతోకాలం నిలువలేదు. ఆయనే దూరమైపోయె... నడుమ నడుమ వచ్చుకుంట పోయేసరికి మూడేండ్ల తర్వాత అనుకోకుండా యిది కడుపుల పడింది. దాంతో పోలీసుల తోటి ఎన్ని దెబ్బలు తిన్నదో ఎవలకెరుక!... ఎక్కడున్నాడో చెప్పు నీ మొగుడు అంటే తానేం జవాబు చెప్ప గలదు? తనకు తెల్సుగనకనా? గిసొంటియన్ని జరుగతయని తనకేమైనా గుర్తా పాడా? ఇక కాన్పుగాదేమో అనుకుంది. తాను.. గిట్లయిపోయె.. ఆయనకన్నా తెల్సి వుండొద్దా.....

అవన్నీ యిప్పుడేమనుకుంటే ఏమొస్తుంది? ఇది కడుపుల పడ్డ కాన్నుంచి నావల్ల గన్ని దెబ్బలు తినే అని సిగ్గుతో యిగ మొకం ఎట్లా చూపించాలనుకున్నాడో ఏమో... మళ్ళీ జాడాపత్తా లేకుంటయిపోయె... గా.. రోజే భలే గమ్మతు... మళ్ళీ గసొంటి రోజులొస్తాయా....? ఆ రోజు... పోలీసు క్యాంపు లేచిపోయి నెల తిరుగలేదు. సీలింగులో పడ్డ దొర భూమిని దున్నటానికి నిలబడ్డది సంగం.

దున్నుతున్నది ఎనిమిదెకరాలేగానీ ఆ రోజు డెబ్బయి నాగండ్లు నడిచాయి. అన్నీ ఎర్రజెండాల్తోటి... ఎడ్లకు ఎర్రరంగు కాగితాల పూలదండలు... అబ్బా... ఎంత గమ్మతనిపించిందో....!

మున్నూరు మంది? అందరూ నవ్వుతున్నారు...ఎగురుతున్నారు.. అరుస్తు న్నారు...జై అంటున్నారు... ఏవేవో అంటున్నారు... నాగండ్లు కదులుతున్నాయి... తనకే గట్లా జైకొట్టే అవకాశం రాలేదు... అప్పుడు దొరదగ్గర్నే పని చేసుడాయె.... ఏమంటాడోనని భయమాయె... సంబ్రంగ చూసుకుంటూ నిలబడ్డది తాను... అందులో అర ఎకురం తమకొస్తే ఎంత బాగుండు.... సొంత మడిచెక్క! అని ఉవ్విళ్ళూరింది. కాని వాళ్ళతోని కలువకుండా తమకెట్లా యిస్తారు?

అట్లా.... ఆయన సంగానికి ఎప్పుడు దగ్గరయ్యాడో తెలియదు... అంత కలెగలిసిపోయింది...

ప్చ్! యిప్పుడు ఎన్ని కష్టాలో....

నిద్రపట్టక అటూఇటూ పొర్లింది పోషవ్వ... ఎలుకలు కుండల సందున గల్లర గల్లర సప్పుడు చేస్తున్నాయి. కుండలు బోర్లా పడ్డట్టయి లేచింది.

పాత కుండల్లో కొన్ని జొన్నలు, పుచ్చిపోయిన పెసల్లు. నయం ఇంకా బోర్లపడి మట్టిపాలు కాలేదు అనుకుంటూ సర్దేసి కుండలకింది మట్టిని చుట్టూ సమతలం చేసింది. మళ్ళీ ఒరిగింది.

ఆ రోజు... ఎంత రాత్రయిందో... కుక్కలు గఁయ్యిన మొరుగుతున్నాయి. ఎక్కడో నక్కలు కూస్తున్నాయి. దూరంగా డీజిల్‌యింజన్లు నీళ్ళు పోస్తున్న చప్పుడు... ఏవో బూట్ల చప్పుడు... సమ్మయ్య తనను కరుచుకొని జ్వరంతో కలవరిస్తూ ఏడుస్తున్నాడు.

బుర్రమీసాల వాడు తల వెంట్రుకలువట్టి బయటకీడ్చి కిందపడేశాడు. చుట్టూ పది మది తుపాకులు వేళ్ళాడేసుకొని ఉన్నారు... ఒకడు ముఖాన్నే చూస్తున్నాడు.

“నీ మొగుడేడే. వాడు యిక్కడిక్కడే తిరుగుతున్నడట.... నీ దగ్గరి కత్తలేడానే లంజెదానా... ఈ బొత్త ఎవలతోని జేపిచ్చుకున్నవే... లేకపోతే నీ మిండని పేరు జెప్పే... లం....” ఈడ్చి అయిదు నెలల కడుపుతో వున్న తన డొక్కలో తన్నాడు వాడు. మూడు వంకర్లు తిరిగి పడిపోయింది.

“చెప్పే. నీ మొగుడెప్పుడొస్తాడో... వాన్ని సరెండర్ చేపియ్యక పోతివీ....”

వీపు గుప్కీగుప్కీమని గుద్దులతో నిండిపోయింది. లాఠీ పుచ్చుకుని ఎన్ని వేశాడో... వానికి చావురాను. వాణ్ణి తొందరలోనే బొందలగడ్డకు పెట్ట. తనగోస తగిలేవాడు గట్టా వీళ్ళ చేతుల్లో కుక్క తీరు చచ్చాడు.

అట్లా ఎన్నిసార్లు దాడులు చేశారో... ఈ పెయ్యంతా (ఒళ్ళంతా) సున్నుసున్ను అయిపోయింది... రెండుసార్లు గుడిసె పీకి కుప్పేసింద్రు. ఈ సంగం కడుపు సల్లగుండా మళ్ళా గుడిసె వేయించారు. తలోచెయ్యివేసి పది రోజుల్లో మళ్ళీ నిలబెట్టారు....

కానీ మళ్ళీ దాడులు తప్పలేదు.... దెబ్బలు తప్పలేదు.. ఈరాత్రి ఎప్పుడు తెల్లార్తదో..

ఈ సంజె చీకట్లు ఎప్పుడు తొలగిపోతాయో.... సంజెపొద్దు నీడల్లో వేలెడంత నీడ లకోటా పొడవుగా పరుచుకుంటున్నట్టుగా వుంది...

ఇంకా ఈ కష్టాలు తప్పవు కాబోలు....

అదిగో... జీవు చప్పుడు వినబడుతోంది...

కూలి డబ్బులు కుండలకింద మట్టిలో కప్పేసి గుండె రాయి చేసుకొని కొడుకుని లేపింది... బూట్ల చప్పుడు మరింత దగ్గరవుతోంది... పోషవ్వ... కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. కొడుకు తల్లిని కరుచుకుపోయాడు...

ఈ సంజె నీడల చీకట్లు ఇంకెన్నాళ్ళో....

పోషక్కా! మన తొలిసంజ మళ్ళీ రాకపోదు.

**కథా కాలం 1987, రచనా కాలం 1987**

**అరుణతార మాసపత్రిక, 1988**